క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత



ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

ఓబులవారిపల్లె : మంగంపేట అగ్రహారం గ్రామానికి చెందిన టి.వెంకటసుబ్బమ్మకు చెందిన రేకుల ఇల్లు మంగళవారం రాత్రి పడిపోయింది. విషయం తెలుసుకున్న చిత్తూరు జిల్లా జేసీఎస్ కో–ఆర్డినేటర్ తల్లెం భరత్‌కుమార్ రెడ్డి బుధవారం బాధితురాలిని పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో వాల్మీకి శ్రీనివాసులు, వార్డు మెంబర్ జి.శారదమ్మ, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆహోలకు శిక్షణ



పశువులకు వైద్య సేవలు అందిస్తున్న ఆహోలు

చిట్వేలి : ప్రభుత్వం మండలానికి చెందిన పశుసంవర్ధకశాఖ సహాయకులు (ఆహో)కు బుధవారం ఎం.రాచపల్లిలో శిక్షణా శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పశువులకు వైద్య సేవలు అందించారు. ఈ శిక్షణా శిబిరం పశువైద్యులు భువనేశ్వరి ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో ఆహోలు భార్గవి, కృష్ణవేణి, నిస్సీ, లక్ష్మణ్, గోవర్ధన్, గోపాలమిత్రలు నరసింహులు, శివ, సుబ్బయ్య పాల్గొన్నారు.

పరామర్శ



కృష్ణారెడ్డిని పరామర్శిస్తున్న సాయికిషోర్ రెడ్డి

ఓబులవారిపల్లె : శస్త్రచికిత్స చేయించుకున్న మండల మాజీ సింగల్‌విండో అధ్యక్షుడు టంగుటూరు కృష్ణారెడ్డిని బుధవారం ఏపీటీడీసీ డైరెక్టర్ సాయికిషోర్‌రెడ్డి పరామర్శించారు. తిరుపతి బర్డ్ ఆసుపత్రిలో కృష్ణారెడ్డి కాలికి శస్త్రచికిత్స చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న సాయికిషోర్‌రెడ్డి కృష్ణారెడ్డి ఆరోగ్య స్థితిగతులపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ సుంకేసుల రఫీ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం.సుకుమార్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

యువత క్రమశిక్షణతో మెలగాలి



యువకులకు సూచనలు చేస్తున్న ఏఎస్ఐ

నందలూరు(రాజంపేట) : యువత క్రమశిక్షణతో మెలిగి తమ భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవాలని ఏఎస్ఐ శంకర్ నాయక్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని అరవపల్లె జిల్లా పరిషత్ క్రీడా మైదానంలో సుమారు వంద మందికిపైగా యువకులను ఏఎస్ఐ శంకర్ నాయక్ రోడ్డు భద్రతా నియమాలపై చెడు వ్యసనాలకు లోను కాకుండా భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలన్నారు. ఐపీఎల్ సమీపిస్తున్నందున ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున యువకులు రాస్తారోకో, సభలు, సమావేశాలు నిర్వహించకూడదని, ఒకవేళ అత్యవసర పరిస్థితుల్లో నిర్వహించుకోవాలంటే ఈసీ పర్మిషన్ తప్పనిసరి అని ఆయన తెలియజేశారు.

ఐసీఐసీఐ ఆధ్వర్యంలో బయో టాయిలెట్ల నిర్మాణం



టాయిలెట్ల నిర్మాణ పనులు చేస్తున్న దృశ్యం

సంబేపల్లె : సంబేపల్లెలో వెలసిన దేవరరాయి నల్లగంగమ్మ ఆలయ ప్రాంగణంలో ఐసీఐసీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న బయో టాయిలెట్ల నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ప్రజలు, భక్తుల సౌకర్యార్థం ఫౌండేషన్ వారు పది టాయిలెట్ల నిర్మాణానికి పనులు ప్రారంభించారు.

మహిళ కడుపులో ఆరు కిలోల కణితి

రాజంపేట టౌన్ : రాజంపేట మండలానికి చెందిన మల్లీశ్వరి అనే మహిళ కడుపులో ఉన్న ఆరు కిలోల కణితిని ఆపరేషన్ చేసి తొలగించారు. మల్లీశ్వరి అనేక సంవత్సరాలుగా కడుపు నొప్పితో బాధపడుతుండేది. దీంతో ఇటీవల ఆమె పట్టణంలోని కృష్ణాస్ లైఫ్ హాస్పిటల్‌లో డాక్టర్ కృష్ణ మాలేపాటిని సంప్రదించగా వారు పరీక్షలు జరిపి గర్భసంచిలో ఉన్న కణితిని తొలగించారు. తొలిసారి తమ హాస్పిటల్‌లో చేసిన అరుదైన ఆపరేషన్ విజయవంతం కావడంతో ఆసుపత్రి యాజమాన్యం ఆనందం వ్యక్తం చేసింది.

అభివృద్ధిని ఆదరించండి.. వైఎస్సార్‌సీపీని గెలిపించండి

- మెరుగైన పాలన కోసం జగన్‌ను మరోమారు సీఎంను చేసుకుందాం
- నంబేపల్లె మండలం ఎస్.సోమవరంలో ఎన్నికల ప్రచారం
- నాయకులతో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



నల్లగంగమ్మకు పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే



ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, నాయకులు

సంబేపల్లె : జగన్ పాలనలో ఇంటింటికీ సంక్షేమ లబ్ధి అందిందని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఎస్.సోమవరం గ్రామంలోని అగ్రహారంలో నల్లగంగమ్మ తల్లి ఆలయం వద్ద డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిదంబర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఉపేంద్రరెడ్డి, మండల కన్వీనర్ ఉదయ్‌కుమార్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు రవీంద్ర నాయుడు, మాజీ సర్పంచ్ పాల వెంకటరమణ, ప్రజలతో కలిసి శ్రీకాంత్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జగన్ ప్రభుత్వంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని వివరిస్తూ గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను తెలియపరిచారు. మరోమారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఆదరించి, ఆశీర్వదిస్తే ప్రజలకు మరింత మెరుగైన పాలన అందిస్తామన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థిగా మిథున్ రెడ్డికి మరోమారు అవకాశం కల్పించాలని శ్రీకాంత్ రెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫ్యాను గుర్తుకు ఓటువేసి గెలిపించాలని ఆయన ప్రార్థించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో జరిగిన అభివృద్ధి కంటే మరింత అభివృద్ధిని వారి తనయుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసి చూపించారని, మరోసారి జగన్‌ను సీఎం చేసుకుంటే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. సీఎం జగన్ ప్రవేశపెట్టిన నవరత్న పథకాలతో ప్రతి ఇంటికి లబ్ధి చేకూరిందన్నారు. గ్రామంలో సిమెంట్ రోడ్లు, తారురోడ్లు, సచివాలయం, రైతు భరోసా, విలేజ్ క్లినిక్, అంగన్‌వాడీలకు శాశ్వత నూతన భవనాలతోపాటు తాగునీరు తదితర మౌలిక వసతులు కల్పించామన్నారు.

అగ్రహారంలో అపూర్వ ఆదరణ

దళితోద్ధారకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని హరిజనవాడ వాసులు ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ఎదుట స్పష్టం చేశారు. అగ్రహారం హరిజనవాడకు విచ్చేసిన శ్రీకాంత్ రెడ్డికి మహిళలు, ప్రజలు కర్పూర హారతులు పట్టి, గజమాలలు వేసి ఆత్మీయంగా తమ ఇళ్ల వద్దకు ఆహ్వానించారు. జగనన్న పాలనలో తమకు నేరుగా ఎవరి సిఫారసు లేకుండానే సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. దళితుల సంక్షేమం, అభివృద్ధికి జగనన్న చిత్తశుద్ధితో కృషి చేస్తూ దళితుల పక్షపాతిగా పేరొందారని హరిజనవాడ వాసులు శ్రీకాంత్ రెడ్డి ఎదుట హర్షం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడు దళితులుగా ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా అంటూ వ్యాఖ్యానించి దళితులను అవమానించారన్నారు. ఇటీవల నారా లోకేష్ దళితులు ఏం పీకుతారని మాట్లాడారని వారు గుర్తు చేశారు. తామెప్పుడూ జగన్ వెంటే నడుస్తామని ఈ సందర్భంగా హరిజనవాడ వాసులు శ్రీకాంత్‌రెడ్డికి స్పష్టం చేశారు.

ముస్లింల సంక్షేమానికి పెద్దపీట

ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డికి దేవలంపేటలో ముస్లిం మైనార్టీలు ఇంటింటా ఆత్మీయ స్వాగతాలు పలికారు. ఈ సందర్భంగా మైనార్టీలు మాట్లాడుతూ మైనార్టీలకు నాలుగుశాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత వైఎస్సార్‌దేనన్నారు. నేడు సీఎం జగన్ మోహన్‌రెడ్డి మైనార్టీల అభ్యున్నతికి పెద్దపీట వేశారన్నారు. మౌజం, ఇమామ్‌ల సంక్షేమం అందించి అండగా నిలిచారన్నారు. వైఎస్ కుటుంబానికి తాము అండగా ఉంటామని దేవలంపేట మైనార్టీలు తెలియజేశారు. కార్యక్రమంలో రమేష్ రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ వి.వెంకటరమణా రెడ్డి, యువ నాయకులు అనిరుధ్‌రెడ్డి, ఆంజనేయులు, అమీర్ బాషా, పెద్దయ్య, వెంకటయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయంలో అభిషేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివార్ల మూల మూర్తులు

రాజంపేట రూరల్ : హరిహర సుతుడు అయ్యప్ప స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణ శివార్లలోని మణికంఠ నగర్‌లో ఉన్న అయ్యప్ప దేవాలయంలో బుధవారం ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు టి.పాలప్రకాష్, ఆర్.వెంకటేశ్వరరెడ్డిల ఆధ్వర్యంలో పూజలను గురుస్వామి కె.సత్యనారాయణ శాస్త్రోక్తకంగా నిర్వహించారు. స్వామివారికి పూజలు చేయించదలచిన భక్తులు ఆలయ ధర్మకర్తలను సంప్రదించి పేరు నమోదు చేయించుకోవాలని ఆలయ కమిటీ వారు సూచించారు.

వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి

పీలేరు రూరల్ : పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతల నేపథ్యంలో వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. బుధవారం తలపుల పీహెచ్‌సీ పరిధిలోని కావలిపల్లె గ్రామ సచివాలయంలో వడదెబ్బ – శిశుసంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలన్నారు.

అందుబాటులో ఉండేందుకే పార్టీ కార్యాలయం



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

చిట్వేలి : ఎన్నికల సమయంలో అందరికీ అందుబాటులో ఉండేందుకు పార్టీ కార్యాలయం ప్రారంభించినట్లు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం ఉదయం 9 గంటలకు మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులు రెడ్డితో కలిసి ఎమ్మెల్యే స్థానిక వైఎస్సార్ సర్కిల్ వద్ద వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అంతకుముందు పాత చిట్వేలిలో వెలసి ఉన్న శ్రీ వరదరాజస్వామి, శ్రీ శ్యామలాంబ సమేత సోమేశ్వరస్వామి ఆలయాలను కొరముట్ల సందర్శించి పూజలు జరిపించారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి, ఎల్వీ మోహన్ రెడ్డి, ఎంపీపీ చంద్ర, సర్పంచ్ ఉమామహేశ్వర్ రెడ్డి, ఏపీటీడీసీ డైరెక్టర్ సాయికిషోర్ రెడ్డి, స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్ మలిశెట్టి వెంకటరమణ, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ముప్పాల హేమనవర్మ, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్ రాజు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సామాన్యుడి ఏకైక ఆయుధం ఓటు



పెనగలూరు మండలంలో..



చిన్నమండెం: అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓలు



ఒంటిమిట్ట: ఓటుహక్కు అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

ఒంటిమిట్ట : సమర్థవంతమైన నాయకుడిని ఎన్నుకునేందుకు సామాన్యుడికి ఉన్న ఏకైక ఆయుధం ఓటు ఒక్కటేనని ఒంటిమిట్ట తహసీల్దార్ వెంకటరమణ, ఒంటిమిట్ట ఎంపీడీఓ జీఎస్ రామచంద్రలు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు ఓటుహక్కుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి పునాది ఓటేనని తెలిపారు. ఓటు హక్కును వినియోగించుకొని సమసమాజ నిర్మాణంలో పాత్రులు కావాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా నచ్చిన వారికి ఓటు వేయాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని పురవీధుల్లో అవగాహన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అయూబ్ ఖాన్, ఈఓపీఆర్డీ కుమార గంగయ్య, ఆర్ఐ రమణ, సీనియర్ అసిస్టెంట్ లీల, ఏపీఎం నాగార్జున నాయుడు, సీనియర్ అసిస్టెంట్ వరప్రసాద్, ఏఎస్ఓ పద్మజ, వీఆర్ఓలు, వీఆర్ఏలు, రెవెన్యూ సిబ్బంది, మండల పరిషత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం

చిన్నమండెం : ఓటు వజ్రాయుధం లాంటిదని తహసీల్దార్ ఆనంద్‌కుమార్, ఎంపీడీఓ రామకృష్ణలు అన్నారు. బుధవారం మండల పరిధిలోని కలిబండ, పడమటికోన, చిన్నర్సుపల్లె గ్రామాల్లో ఓటర్లకు అవగాహనా ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

నిజాయితీగా.. నిర్భయంగా ఓటు వినియోగించాలి

పెనగలూరు (ఓబులవారిపల్లె) : నిజాయితీగా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించాలని సీనియర్ అసిస్టెంట్ కుమారస్వామి తెలిపారు. మండలంలోని నల్లపరెడ్డిపల్లి, చక్రంపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులు వారి తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓటింగ్ శాతం పెరగాలని తెలియజేశారు. గ్రామాల్లో ఓటరుగా నమోదైన వారిని ఇక్కడికి పిలిపించి ఓటు వేసేలా చూడాలని సూచించారు. అలానే ఓటు ప్రాముఖ్యతను అందరికీ తెలియజేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, రెవెన్యూ అధికారులు, ఆర్ఐ చంద్రమోహన్ రెడ్డి, వీఆర్ఓ వెంకటేశ్వర స్వామి, వెలుగు సిబ్బంది ఆనంద్ పాల్గొన్నారు.

కనుల పండువగా వేంకటేశ్వరుడి కల్యాణం

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



ఉత్సవమూర్తులకు కల్యాణం జరిపిన దృశ్యం

గాలివీడు : కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం గాలివీడులో అంగరంగ వైభవంగా నిర్వహించారు. బుధవారం మండల కేంద్రంలోని పెద్దూరు బ్రాహ్మణ వీధి వేంకటేశ్వరుడి ఆలయంలో స్వామి విగ్రహ, జీవ, ధ్వజ శిఖర ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా జరిపారు. అనంతరం స్వామి కల్యాణోత్సవ కార్యక్రమం పండితుల వేద మంత్రోచ్ఛారణల నడుమ కనుల పండువగా సాగింది. అంతకుముందు స్వామి వారికి మంగళ స్నానాలు, అభిషేకాలు చేశారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అర్చక స్వాములు, భక్తులను ఆశీర్వదించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కల్యాణోత్సవం అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను శోభాయాత్రను కోలాటాలు, భగవంతుని వేషధారణలు, భక్తి పాటలు పుర వీధులలో పండుగ వాతావరణం కనిపించింది.

కార్మికులకు పెండింగ్ జీతాలు చెల్లించాలి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మిక నేతలు

రాజంపేట : మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని కమిషనర్ రాంబాబును కోరారు. బుధవారం మున్సిపల్ కార్మిక సంఘాల నాయకుల ఆధ్వర్యంలో కార్మికులు కమిషనర్‌ను కలిశారు. సమస్యల పరిష్కారానికి గతంలో 16 రోజులపాటు సమ్మె చేశామన్నారు. సమ్మెలో ప్రభుత్వంతో జరిపిన చర్చల్లో పలు సమస్యలకు పరిష్కారానికి జీఓలు జారీ చేసిందన్నారు. రాజంపేట మున్సిపల్ అధికారుల తప్పిదాలతో కార్మికులకు రావాల్సిన వేతనాలు, సంక్రాంతి కానుక, సమ్మెకాలం జీతం అందలేదన్నారు. నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. 25వ తేదీ జీతాలు పడకుంటే 26 నుంచి సమ్మె చేపడతామని తెలియజేశారు. అనంతరం ఈ మేరకు వినతిపత్రాన్ని కమిషనర్‌కు అందజేశారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తాం



వీరబల్లె మండల కేంద్రంలో బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న బ్యాంక్ అధికారులు

రాయచోటి టౌన్ /వీరబల్లె (రాయచోటి టౌన్) : ఖాతాదారులకు మరిన్ని మెరుగైన సేవలందించేందుకు బ్యాంక్ ఆఫ్ బరోడా ఏర్పాటు చేస్తున్నట్లు ఆ బ్యాంక్ హైదరాబాద్ నేషనల్ డివిజనల్ మేనేజర్ – 1 గోవింద్ ప్రసాద్ వర్మ, అసిస్టెంట్ జనరల్ మేనేజర్, రీజనల్ హెడ్ తిరుపతి అమర్‌నాథరెడ్డిలు అన్నారు. బుధవారం బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచ్‌లు రాయచోటి పట్టణంలో ఒకటి, వీరబల్లె మండల కేంద్రంలో మరొకటి ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ రాయచోటి బ్రాంచ్ ద్వారా రాయచోటి పట్టణంతోపాటు 15 గ్రామాల ప్రజలకు సుమారు 1.5లక్షల మందికి సేవలు అందిస్తుందని తెలిపారు. వీరబల్లె బ్రాంచ్ శాఖ ద్వారా 20 గ్రామాల వారికి సేవలు అందిస్తామని చెప్పారు. రైతులకు క్రాప్ లోన్, బంగారు రుణాలు, గృహ నిర్మాణానికి రుణాలు, వ్యాపార రుణాలు అందించడంతోపాటు రూ.500లతో ఖాతా తెరిచేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీరబల్లె ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గాలివీటి వీరనాగిరెడ్డి, ధర్మారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, కుల్లాయిరెడ్డి, జెడ్పీటీసీ శివరాం, ఎంపీటీసీ పురుషోత్తం రెడ్డి, బ్యాంక్ మేనేజర్ నాగవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం



అవగాహనా కార్యక్రమంలో ఫార్మసీ విద్యార్థులు

రాజంపేట : మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం అవుతాయంటూ అన్నమాచార్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డా. డి. స్వర్ణలత పేర్కొన్నారు. బుధవారం కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్పెషల్ క్యాంపు నిర్వహించారు. అనంతరం కళాశాల చుట్టుపక్కల గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఆయా గ్రామాల వాసులకు మద్యపానం, ధూమపానం, మాదకద్రవ్యాల వాడకం ద్వారా వచ్చే నష్టాలను వివరించారు. చెడు వ్యసనాలకు బానిస కాకుండా కుటుంబాల బాధ్యతను చూసుకోవాలని తెలియజేశారు. చెడు వ్యసనాలు దరిచేరితే ఆరోగ్యాలను గుల్ల చేస్తాయని, అందువల్ల అలాంటి వాటిని విడిచి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా కుటుంబాలతో సంతోషంగా జీవించాలని సూచించారు. అనంతరం దుర అలవాట్లను సేవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో కార్యక్రమ నిర్వహణ అధికారి వై.ప్రదీప్ కుమార్, కళాశాల ఎన్ఎస్ఎస్ బృందం పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాలను పరిశీలించిన అధికారులు



ఓబులవారిపల్లె: ఎంఈఓ రెడ్డయ్యను అడిగి వివరాలు తెలుసుకుంటున్న తహసీల్దార్ శేషగిరి రావు

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని ముక్కవారిపల్లె గురుకుల పాఠశాల, ఓబులవారిపల్లె మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తల్లెం వారిపల్లె ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షా కేంద్రాలను బుధవారం తహసీల్దార్ శేషగిరి రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ రెడ్డయ్య మాట్లాడుతూ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించడం జరుగుతోందని, ఇంగ్లిష్ పరీక్షకు మండల వ్యాప్తంగా 698 మంది హాజరుకావాల్సి ఉండగా 685 మంది హాజరైనట్లు వారు తెలిపారు.

సంబేపల్లెలో..

సంబేపల్లె : మండలంలో పక్బందీగా, ప్రశాంతంగా పది పబ్లిక్ పరీక్షలు జరుగుతున్నాయి. బుధవారం మండలంలోని పరీక్షా కేంద్రాలను ఎంఈఓలు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు తనిఖీ చేశారు. వీరితోపాటు సిట్టింగ్ స్క్వాడ్ అనునిత్యం పరీక్షలను పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే పోలీసులు పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు పరీక్ష కేంద్రాల వద్దనే ఏఎన్ఎంలు ఓఆర్ఎస్ ప్యాకెట్లతోపాటు ఇతర ప్రాథమిక చికిత్స కిట్లతో అందుబాటులో ఉంటున్నారు.

గ్రామ రక్షక దళాలతో శాంతి భద్రతల పరిరక్షణ



గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

రైల్వేకోడూరు : గ్రామాలలో శాంతి భద్రతల కోసం ప్రజలకు గ్రామ పరిరక్షక దళాలతో రక్షణ కల్పిస్తున్నట్టు సీఐ బాబు తెలిపారు. బుధవారం ఓబనపల్లెలో నేరాల నియంత్రణలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించారు. నేరాల నియంత్రణలో గ్రామ రక్షక దళాలు కీలక పాత్ర పోషించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాత్రి వేళల్లో దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ఎప్పటికప్పుడు గ్రామాల్లో కొత్త వ్యక్తుల రాక, భారీ విధ్వంసాలకు రూపకల్పన తదితరాలపై నిఘా ఉంచి పోలీసులకు తగిన సమాచారం ఇవ్వాలని సూచించారు. దొంగల ముఠాకు సంబంధించిన సమాచారం తెలుసుకుని గ్రామాల్లో ప్రజలకు తగిన అవగాహన కల్పించాలన్నారు. నేరాల నియంత్రణ కోసం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఎప్పటికప్పుడు ఏదైనా కొత్త విషయం తెలిసినప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మహిళలపై జరుగుతున్న నేరాల నియంత్రణ కోసం ప్రత్యేక టీమ్‌లు పనిచేస్తున్నాయన్నారు. అలాగే శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా గ్రామాల్లో నిర్బంధ తనిఖీలు చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ నాయక్, పోలీస్ సిబ్బంది, కేంద్ర బలగాలు పాల్గొన్నారు.

నిరంతర ప్రజాసేవకుడు అనిల్



అనిల్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

సిద్దవటం : నిరంతర ప్రజాసేవకుడు ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి అంటూ నాయకులు కొనియాడారు. బుధవారం వైఎస్సార్‌సీపీ రాజంపేట నియోజకర్గం నాయకుడు ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డికి పుట్టినరోజును పురస్కరించుకుని కనుమలోపల్లెలోని ఆకేపాటి భవన్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయనకు శాలువా కప్పి సన్మానించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన చేత కేక్‌ను కట్ చేయించారు. కార్యక్రమంలో మేడా మధుసూదన్‌రెడ్డి, ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, ఏకుల రాజేశ్వరిరెడ్డి, జెడ్పీటీసీ శ్రీకాంత్‌రెడ్డి, నీలకంఠారెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఎన్నికల నియామవళిని పాటించాలి

డివిజనల్ ఎన్నికల అధికారి మోహనరావు



అధికారులకు సూచనలు చేస్తున్న ఏఓ మోహన్‌రావు

రాజంపేట రూరల్ : రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు, కార్యకర్తలు ఎన్నికల కమిషన్ విధించిన మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను తప్పక పాటించాలని డివిజనల్ ఎన్నికల అధికారి మోహనరావు కోరారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం డీఎస్పీ చైతన్యతో కలిసి వివిధ శాఖల అధికారులతో మోహనరావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లౌడు స్పీకర్ ఉపయోగిస్తూ ఏర్పాటు చేసే ఎన్నికల ప్రచారంతోపాటు సమావేశాల్లో వాహనాల వినియోగం, ఇంటింటి ప్రచారంలో కరపత్రాల పంపిణీ, సభల్లో వినియోగించే స్టేజ్, బారికేడ్ల నిర్మాణంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసుకునే పార్టీ కార్యాలయం ఏర్పాటు విషయంలో అనుమతులు తీసుకోవాలన్నారు. అనుమతుల కోసం సువిధ యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఎన్నికల ప్రచారానికి ఈ యాప్ ద్వారా 19 రకాల అనుమతులు పొందవచ్చని చెప్పారు. ర్యాలీలు నిర్వహించే ప్రదేశం, సమయం కచ్చితంగా ఇవ్వాలని పేర్కొన్నారు. అదే విధంగా పరీక్షలు నిర్వహించే పాఠశాలలు, దేవాలయాల వద్ద స్పీకర్‌లు వాడరాదని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

నందలూరు(రాజంపేట) : నాగిరెడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని ఎర్రచెరువు కట్టవద్ద అయ్యప్ప స్వామి దేవాలయ నిర్మాణ శంకుస్థాపన మహోత్సవం శబరిమల ప్రధాన పూజారి దామోదరం చేతులమీదుగా నిర్వహించారు. బుధవారం ఉదయం గణపతి హోమం, నవగ్రహ ఆరాధన, దీపారాధన, గోపూజు చేశారు. అనంతరం శంకుస్థాపన కార్యక్రమాన్ని ప్రధాన తంత్రి బ్రహ్మశ్రీ కందరరు మహేష్ మోహనరు, పురోహితులు బండాత్మకూరు శివకుమార్ శర్మలు జరిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజంపేట వైఎస్సార్‌సీపీ శాసనసభ అభ్యర్థి ఆకేపాటి అమరనాథరెడ్డి, ఎంపీపీ మేడా విజయ భాస్కర్ రెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు భూమన శివశంకర్ రెడ్డి, ఆకేపాటి జగదీశ్వర్ రెడ్డి, అరిగెల సౌమిత్రి, అరిగె మణి, హరిబాబు, పల్లె గ్రీష్మంత్ రెడ్డి, ఆనాల మధు యాదవ్, వైస్ సర్పంచ్ ఇబ్బు, మధురాజు, భాస్కర్ యాదవ్ పాల్గొన్నారు.

అంగళ్లులో పోలీసు బలగాల కవాతు

కురబలకోట : సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలో అంగళ్లు కీలకంగా మారింది. అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇప్పటికే ఈవీఎం స్ట్రాంగ్ రూములు ఏర్పాటు చేశారు. ఇక్కడి నుంచే నియోజకవర్గంలోని పోలింగ్ బూత్‌లకు ఈవీఎంలు పంపుతారు. అదే విధంగా కేంద్ర బలగాలు కూడా అంగళ్లు కేంద్రంగా పనిచేస్తున్నాయి. ఎన్నికలు పూర్తయ్యే వరకు ఇవి అంగళ్లు కేంద్రంగా పనిచేస్తాయి. అంతేగాకుండా అంగళ్లులో తనిఖీలకు చెక్ పోస్టును కూడా ఏర్పాటు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. దీంతో ఈఎన్నికల్లో నియోజక వర్గంలో అంగళ్లు కీలకంగా మారుతోందన్న విషయం స్పష్టమవుతోంది.